
# కత్రగుత్తం

కరుణాకర్



'అరే రామూ...'

'ఏమ్మా ?'

'ఈరోజు సీతాపతిగారి దగ్గరకు వెళ్ళిరా నాయనా...మీ అన్నకూడా ఆఫీసుకు పొయ్యేప్పుడు చెప్పొయ్యాడు."

ఎందుకూ ? అనడగలేదు. ఇది ఇరువురికీ అండర్‌స్టుడ్ అన్నమాట.

'ఇప్పుడే వెళ్తున్నాను.' లేచి చెప్పుల్లో కాళ్ళు దూర్చుకుంటున్నాడు.

'తలైనా దువ్వుకోరా...హుఁ' అతడి వైరాగ్యానికి ఆమె నిట్టూర్చింది.

'ఓహ్...' అంటూ వెనుదిరిగి అద్దంలో ముఖం చూసుకున్నాడు. గడ్డం పెరిగిపోయింది. కానీ... ఇప్పుడు టయింలేదు అనుకున్నాడు. కళ్ళకింద చారలు స్పష్టంగా కనిపిస్తున్నాయ్. ఇరువైపులా దవళ్ళు లోపలికి చొచ్చుకపోయినట్లున్నాయి.

"వెళ్ళొస్తానమ్మా."

"ఆఁ వెళ్ళిరా నాయనా .... చూడు. సిరికిపడకుండా అడుగు. పెద్దోళ్ళదగ్గర మనకష్టాలు తెలుపుకుంటే వాళ్ళయినా అయ్యోపాపం అంటారు అడగంది అమ్మయినా పెట్టదు."

పై మాటలు మద్రాసుచేరిన నాలుగుమాసాల నుండీ రామ్మూర్తికి ఇల్లువదలేప్పుడల్లా విని పిస్తాయ్ వినిపించకపోయినా స్మృతిపథంలో ప్రతిధ్వనిస్తాయి.

ఒకరోజు ఉదయాన్నే మూర్తి, సీతాపతిగారి ఇల్లు సమీపించాడు. ఇంటినంబరు తన చేతిలో వున్న అడ్రస్ ప్రకారమే ఉంది. ఎత్తైనమేడ. చుట్టూ విడివైన ప్రాకారం. కుక్కలుంటాయేమోనని మొదట శంకించాడు. కానీ, కుక్కలూ లేవు. మనుషులూ లేరు. వాకిళ్ళన్నీ మూసుకొనివున్నాయి. గేటుతీసుకొని లోపలికి అడుగుపెట్టాడు. రకరకాల పూలచెట్లు అందంగా వికసించి ఉన్నాయి. కానీ, వానిలో సౌకుమార్యం లోపించినట్టుంది. కేవలం తృష్ణ, లాలసత్వంతో విర్రవీగుతున్నట్లుంది. ఒకవైపు కొబ్బరిచెట్లు ఆ స్మశానవాతావరణానికి విదర్శనంగా నిలబడి ఉన్నాయి. ఇటువైపు గేరేజిలో రెండు మూడు కార్లు విశ్రాంతి తీసుకుంటున్నాయ్. ఎందుకో ఆ వాతావరణం అతనికి నచ్చలేదు.

వాకిలి కిర్రుమంది. ఓ పెద్దమనిషి గోడ బొరకలోనుండి తలబైటికి చాచిన పాములా తొంగి చూస్తూ "ఎవరు నువ్వు?" అన్నాడు

"నేను...వెంకటేశం తమ్ముణ్ణి."

'ఓహో...'బయటికొచ్చి వరండా కుర్చీలో కూర్చున్నాడు.

"నీ పేరేమిటి ?"

'రామ్మూర్తి' ఇతడే కావచ్చు సీతాపతి అనుకున్నాడు.

"ఎంతవరకు చదువుకున్నావు?"

"పి. యు. సి. వరకు."

"టైపు వస్తుందా?"

"లోయర్ పాసయ్యాను."

"ఇంత ఆలశ్యంగా వచ్చావేమిటి?"

"మా అన్న రెండు వారాల కిందట రాసిన జాబు నాకు మొన్ననే చేరిందిసార్.'

'అయ్యో" ఆ అయ్యో అన్న శబ్దం హృదయం నుండి వచ్చినట్లులేదు. కీ ఇచ్చిన అలారమ్‌లాగా ఉంది.

"నిన్న మీ అన్న నువ్వొచ్చినట్లు చెప్పాడు. నేను మా సెక్రెటరీకి ఫోన్‌చేసి తెలుసుకున్నాను. ఆఫీసులో పని ఎక్కువైనందువల్ల వేరే ఎవణ్ణో మొన్ననే అప్పాయింట్ చేసుకున్నాడట.

'సరే, ఒకపని చేస్తావా?" ఏదో యోచిస్తున్నట్టు మూడ్ పెట్టాడు.

"చెప్పండి."

'ఆహాఁ ఏంలేదు. అప్పుడప్పుడు మాయింటికి వస్తూండు. నువ్వు క్లర్కు ఉద్యోగం ఎట్లాచెయ్యాల్సిందీ చెప్పిస్తాను. ఆ తర్వాత ...ఎక్కడైనా ట్రైచేస్తాం' మంచిదేకదా అన్నట్లు ప్రశ్న సూచకంగా మూర్తి ముఖంలోకి చూశాడు.

అట్లే కానివ్వండి సార్' అన్నాడు మూర్తి.

'రేపు ఈవేళ కల్లా రా ఇకపోవచ్చు అన్నట్లు కుర్చీలోంచి లేచాడు.

'సమస్తే వస్తా సార్'

'మంచిది'

వారానికి మూడు లేక నాలుగు రోజులు సీతాపతి గారింట్లో డ్యూటీ

"ఇదో రామ్మూర్తీ ...నువ్వు రోజూ ఎన్ను కొస్తున్నావా ?"

'ఔను సార్ !"

"చార్జీ ఎంత ?"

"ముప్పై పైసలు"

"అయ్యో!... నువ్వొట్టి అమాయకుడివయ్యా ...చూడు, ఇటు మా యింటి వెనగ్గా వెళ్ళు. కొంత దూరం వెళ్ళాక కాలువొకటి వస్తుంది. ఒకణా ఇచ్చావంటే నిన్ను పడవలో అవైపుకు దాటిస్తారు. తరువాత మీవీధికి నాలుగు మైళ్ళుంటుంది హాయిగా నడుస్తూ పోవచ్చు."

"సరే సార్"

'బ్రేవ్... తేపులు. నేతికంపు.

"ఈ రోజుకి చాలు...రేపు ఉదయాన్నే రా... అర్జెంటు లెటర్ రాకటుంది. టైపుచేసి పంపాలి"

'సార్!..."

"ఏంటి?"

"ఎక్కడైనా ఉద్యోగం..."

"చూస్తున్నానయ్యా... నీ కోసం చాలా ప్రయత్నిస్తున్నాను. ఈ రోజుల్లో ఉద్యోగాలు దొరకడం చాలా కష్టం. తొందరపడితే ఎట్లా ... కొంచం ఓపిక పట్టు.'

అదికాదు సార్! ... ఇంట్లో చాలా కష్టంగా ఉంది సార్.'

ఔను మరి ...కిలో వంకాయలు ఒకటిన్నర రూపాయ. కందిపప్పు శేరు మూడ్రూపాయలు. అన్నీ పిరియమే ఈ మద్రాసులో......ప్చ్, ఏం చేద్దాం.'

టంగ్...టంగ్...టంగ్' రిక్షా నిద్రనుండి మేల్కొన్నట్టయింది.

నడిరోడ్డుపై పందికొక్కు శవాన్ని కాకులు పీక్కుతింటున్నాయ్.

వీధికొనన కుంటిఅమ్మాయి నవ్వుతూ కనిపిస్తుంది.

ఆ ప్రక్కనే రాగిమానుకింద గుడ్డిముసల్ది తన బ్రతుకును రోడ్డుపాలు చేసినట్లు గుడ్డపరిచి. చేయి చాచి 'బాబూ ... ఒక్క పైసా...' దీనంగా హీనంగా ప్రాధేయపడుతుంది. ఆ కంఠస్వరం ఆ ఆర్తనాదం విన్నప్పుడు. తలచుకున్నప్పుడు ఎవరిదో గొంతుకోస్తుంటే చూస్తూ పోతున్నట్లుగ టుంది ఆ రాగిమాను ఆవరణలో ప్రతి అడుగూ ముసలిదాని గుండెలపై మోపి దాటిపోతున్నట్టుంటుంది.

పిల్లలు, యువకులు, యువతులు - పుట్టలు పగిలిన చీమలదండులాగా, పేడకింద చెదపురుగులాగా, స్కూళ్ళకు కాలేజీలకు పరిగెత్తున్నారు. "వీళ్ళందరి కీఉద్యోగమో"

'ఏమైనాకాని ఈరోజు సీతాపతిగార్ని గట్టిగా అడగాలనుకున్నాడు.

'నమస్తే సార్'

'ఆఁ వచ్చావా...మీ అమ్మకు జ్వరమన్నావే ఎట్లుంది?'

సుమారుగా ఉంది'

ఈరోజు సీతాపతిగారు కులాసాగా ఉన్నట్టనిపించింది.

'సార్...!"

"ఆఁ"

"మా అన్న ఊరికి పొమ్మంటున్నాడు"

"ఎందుకు?"

"ఉద్యోగం దొరకదని"

"నిజమే...దొరకడం దుర్లభమే"

"మరి మీరు..."

'నేనేం చెప్పాను?...నువ్వేదో ఆఫీసువర్క్ నేర్చుకుంటావనే ఉద్దేశ్యంతో రమ్మన్నాను. మీ అన్న చెప్పినట్లు ఊరికిపో."

'ఊరికిపోయి ఏం చేయాలిసార్?"

"పొలం దున్ను"

"అదీలేదు"

"లేకపోతే? మనుషులంతా ఉద్యోగాలపైనే బ్రతుకుతున్నారా? అలా కళ్ళువిప్పి చూడు. నీ ఎదుటే ఎన్ని పనులు జరుగుతున్నాయో!"

"మీరేమి ఇప్పించలేరా?" ఇదే ఆఖరుమాటగా అడిగాడు.

'ఆఁహాఁ' అన్నాడు సీతాపతి.

"సరే వస్తా'

"ఇదో బాబూ...నీకు ఉద్యోగమివ్వలేదని ఆత్మహత్య చేసుకోనివచ్చేవ్, నా నెత్తికొస్తుంది. మీ అన్న చెప్పినట్టు పో!'

'మీ సలహాకు కృతజ్ఞుణ్ణి" మూర్తి వేగంగా ఆవేదనగా గేటుదాటి బయటకొచ్చేశాడు

ఈ మూర్ఖుడు ఎంత నీచుడు. దుర్మార్గుడు ఉద్యోగమిస్తానని పిలిపించి ఆశ చూపించి నాలుగు మాసాలు తన చేత వెట్టిచాకిరీ చేయించుకొని చివరికి వట్టిచేతులు చూపుతాడా ఎంత మోసం ఈ ధనం, ఈ పేరు, ఈ ప్రఖ్యాతులు ఎందుకు ఎన్ని హత్యలుచేసి. ఎందరి రక్తంత్రాగి తెప్పున్నారు! ఊడలుబారిన ఈ ధన మదాంధుల దౌష్ట్యం. మోసం ఎప్పుడో ఒక్కసారి కూకటి వ్రేళ్ళకి పెళ్ళగిల్లుతుంది. అప్పుడు చూడాలి... రామ్మూర్తి రక్తం పొంగిపోయింది. ఈ లోకంపైనా లోకులపైనాఅసహ్యం పెల్లుబికింది. జీవితంపై మళ్ళీ దట్టమైన నైరాశ్యం అలుముకుంది. ఎన్నో తూర్లు ఆత్మహత్య చేసుకొంటే పీడ విరగడౌతుందనుకున్నాడు. కాని...ఇంకా జీవితంపై ఏదో ఆశ. ఎప్పుడో ఒకప్పుడు ఈమోడుపడ్డ మొక్క వికసించకపోతుందా అనే నమ్మకం. అందువల్ల ఇంకా .. ఇంకా ... చూద్దామనే నిరీక్షణ ... కృష్ణ వెన్నంటుతోంది.

ఔను అతడన్నట్లు ప్రపంచంలో ఎన్ని పనులేవు? కేవలం కాగితాలు గీకినంతమాత్రాన గొప్పతనమేముంది? అందరి ఆశయమూ జానెడు పొట్ట నింపుకోవడమే. మరి హెచ్చు...తగ్గు అనే తేడా ఎందుకుండాలి? యజమాని కూలీలను కుక్కలకంటే హీనంగా చూస్తాడే! తోటివాణ్ణి పందికన్నా హీనంగా చూస్తారేమి? సమాజం ఇంత సంకీర్ణంగా ఉన్నప్పుడు ఆ నికృష్ట జీవితంలోకి అడుగుపెట్టడం ఎలా సాధ్యం?

రామ్మూర్తి ఆలోచనలకి, నడకకు మాంబలం రైలు గేటు అడ్డుతగిలింది. దూరంనుండి కరెంటు రైలు బుసపెట్టుకొంటూ, గసపెట్టుకొంటూ పరుగెత్తోంది. ఇట్టే రైలు కమ్మీపై తలమోపితే?... లోకమేమనుకుంటుంది?...పిరికివాడు అంటుంది; జీవితంలో ఓడిపోయిన వ్యక్తి అంటుంది. అనుకోనీ...బ్రతికి ఓడిపోయానని పదే పదే లోకం చేత ఉమ్మి ఊయించుకొనే దానికంటే చచ్చి ఒడిపోతే...రైలు గేటు దాటింది. కరెంటుగేటు తెరుచుకుంది. కాలువ తెగిన నీటిలాగా మనుషులు గేటు దాటుకుంటున్నారు. వారితోపాటు మూర్తి కూడా.

స్కూలు గేటు పక్కన ఇద్దరు గుడ్డివాళ్ళు నల్ల కళ్ళజోళ్ళు పెట్టుకొని 'పాడిందె పాడరా పాచిపళ్ళ దాసరి' అన్నట్టు ఎప్పుడూ పాడే పాటే పాడుతున్నారు. వారి ఘోష కుక్కలు కూడా భరించలేకున్నాయి.కాని, ఒకేపాట ఒకే జీవితం! చాలు. కనీసం ఈ బ్రతుక్కి ఇంతే గతి అన్న సంతృప్తయినా మిగిలింది. తనకు అదీ లేదు. ఏదీ లేదు.

రోజులాగే వేపమాను ప్రక్క ఉన్న ఇంట్లో కుర్రాడు కర్రగుఱ్ఱంపై కూర్చొని ముందుకు ... వెనక్కు. ముందుకు ... వెనక్కు ఊగుతూ సవారి చేస్తున్నాడు కానీ, అది అడుగైనా ముందుకు కదల్లేదు. ఎక్కడ వేసింది అక్కడే ఉంది. ఆ పిల్లవాడు సవారి చేస్తున్నప్పుడు తనని చూశాడంటే చిరునవ్వులు చిందిస్తాడు. ఎందుకో? తన బ్రతుక్కూడా అతడి సవారిలాగే ఉందని తెలుసునేమో! అనుకున్నాడు మూర్తి.

★

